

ఎన్టీపీసీ అభివృద్ధికి సహకరించాలి



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ప్రాంత అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఈడీసీ మిలీనియం హాలులో ఏరియా వ్యాపారస్తులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్టీపీసీ ఏరియాలో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించి 15 కోట్ల రూపాయల విలువైన పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రామగుండం అభివృద్ధికి ప్రధానంగా వ్యాపార వర్గాల వారు సహకరిస్తున్నారని, వీరిచ్చిన స్ఫూర్తితో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. రోడ్డు వెడల్పు విషయంలో ఎన్టీపీసీ ప్రాంత వ్యాపారులు, ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారని, వారందరికి ఎ మ్మెల్యే కృతజ్ఞతలు అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సర్వీస్‌రోడ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యాపారులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీపై నీలినీడలు

- దాఖలైన రెండు టెండర్లు అనర్హమైనవే..
- ఉన్నతాధికారులకు లేఖ రాసిన అధికారులు
- చేప పిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలంటున్న మత్స్యకారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లల పంపిణీపై నీలినీడలు అలముకున్నాయి. చేప పిల్లలు పంపిణీ చేసే విషయమై ప్రభుత్వం ముందుచూపు కనబరచక పోవడంతో రెండేళ్లుగా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది కూడా ప్రభుత్వం ఆలస్యంగా పంపిణీ చేపట్టడంతో కాంట్రాక్టర్లు నాణ్యతలేని చేప పిల్లలను తీసుకువచ్చి పంపిణీ చేసేందుకు సిద్ధం చేయడంతో వాటిని మత్స్యకారులు తిరస్కరించారు. దీంతో ఆ ఏడాది జిల్లాలో ఏ ఒక్క మత్స్య సహకార సంఘానికి కూడా చేప పిల్లల పంపిణీ జరగలేదు. ఈ ఏడాదైనా ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా అందిస్తుందని మత్స్యకారులు ఎదురుచూశారు. కానీ ముందస్తుగా టెండర్లను ఆహ్వానించక పోవడంతో జాప్యం జరుగుతున్నది. చేప పిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నా ప్రభుత్వం టెండర్లకే వెళ్ళింది. అర్హత లేని కాంట్రాక్టర్లు టెండర్‌కు దరఖాస్తు చేసుకోవడంతో అవి కొట్టుకుపోయాయి. దీంతో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది.

జిల్లాలో 1018 చెరువులు, కుంటలతో పాటు శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ ఉంది. వీటిలో కోటి 60 లక్షల చేప పిల్లలను మత్స్యకారుల ద్వారా పెంచేందుకు జిల్లా మత్స్యశాఖ ప్రణాళికలు రూపొందించింది. చేప పిల్లల సరఫరాకు ప్రభుత్వం ఆగస్టు రెండో వారంలో టెం డర్లను ఆహ్వానించింది. ఆ మేరకు ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. దాఖలైన టెండర్లను గడువు తేదీ సెప్టెంబరు 8 తర్వాత సంబంధిత అధికారులు పరిశీలించారు. అందులో ఒక టెండర్ ప్రీ క్వాలిఫికేషన్ లో కొట్టుడుపోగా, మరో టెండర్ వేసిన



కాంట్రాక్టర్‌కు జిల్లాకు సరిపడా చేప పిల్లలను పంపిణీ చేసే సామర్థ్యం లేదని గుర్తించి రద్దు చేశారు. అనంతరం జిల్లాలో చేప పిల్లల పంపిణీ కోసం అర్హత కలిగిన కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయలేదని, ఇతర జిల్లాల నుంచి జిల్లాకు చేప పిల్లలను సరఫరా చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారులు ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. దీనిపై నిర్ణయం వెలువడే లోపే సెప్టెంబరు 27వ తేదీన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 పై పలువురు కోర్టును ఆశ్రయించి కొట్టివేయాలని అభ్యర్థించారు. దీనిని విచారించిన హైకోర్టు ఆరు వారాల పాటు బీసీ రిజర్వేషన్లను, ఎన్నికల నోటిఫికేషన్లు తాత్కాలికంగా వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నిలిచి పోయింది. స్థానిక సంస్థల ఎన్నికలపై తుది విచారణ నవంబరు 20వ తేదీ తర్వాత జరగనున్నది. అప్పటి వరకు ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందా, లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఈ ఏడాది సాధారణ స్థాయికి మించి జిల్లాలో వర్షాలు కురవడంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు అన్ని జల కళను సంతరించుకున్నాయి. వాస్తవానికి ఆగస్టు నెలాఖరు లోపే చెరువులు, కుంటల్లో చేప పిల్లలు పోయాల్సి

(మిగతా 8వ పేజీలో)

భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలని, సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని నిలిపి వేయాలని, సంక్షేమ పథకాలను నేరుగా ప్రభుత్వమే కార్మిక వర్గానికి అందజేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నరేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే ఈ స్కీములను కార్మికులకు అందజేయాలని, సాధారణ మరణానికి, మ్యారేజ్ గిఫ్ట్, మెటర్నటీ, హాస్పిటలైజేషన్‌కు, శాశ్వత అంగవైకల్యానికి నిధులు పెంచాలన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వీరికి అడ్డాల వద్ద, పని స్థలాల్లో భద్రత, రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని తక్షణమే కార్మిక వర్గానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. 60 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు ఎం దుర్గయ్య, ఐ రాజేశం, ఎం కొమరయ్య, బి రాజనర్సు, కే మల్లేశం, తిర్రి బాలకృష్ణ, నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిషేధంపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది చేత కమిషనర్ ఆకుల వెంకటేష్ మాదక ద్రవ్యాలను నిరోధించాలని ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం పాటు పడుతానని, అలాగే ప్రతి ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని వాటి అమ్మకాలు, కొనుగోళ్ళు తరలించినట్లు సమాచారం ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పిల్లలు డ్రగ్స్‌కు బానిస కాకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య పరిస్థితులపై వివరించేందుకు అవగాహన కల్పించాలన్నారు. కేవలం సమావేశాలు, అవగాహన సదస్సులకే కాకుండా ఆచరణలో పెట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. మున్సిపల్ మేనేజర్ లింగయ్య, ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారులు వినయ్, కిరణ్, సుచరిత, శ్యామల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ ఇస్తానని పుస్తెలతాడు చోరీ
- ఫొటోలు ముఖ్యమంత్రికి పంపాలని చెప్పి మోసం
- ఫొటోలో పుస్తెల తాడు ఉంటే పెన్షన్ రాదని నమ్మించి పరారీ
6

సెంటినరీకాలనీలో యువకుడి దారుణ హత్య
- మహిళా సమైఖ్య కార్యాలయం ఎదుట ఘటన
6

సమాచార హక్కు చట్టాన్ని గౌరవించాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ
8

బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో తీర్మానానికి బీజేపీతోపాటు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. ముఖ్యమంత్రి ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపగా ఢిల్లీకి పంపించారని, దానిని ఆమోదించేందుకు అన్ని పార్టీలకు ఆహ్వానం పలికి ఢిల్లీ వెళ్తే బీజేపీ నేతలు రాలేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాల్సిందిపోయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదునాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రానున్న స్థానిక సంస్థల్లో బీజేపీ అడ్రస్ గల్లంతవుతుందన్నారు. బండారి రాం మూర్తి, బూతగడ్డ సంపత్, శ్రీనివాస్, ఎరుకల రమేష్, తూముల సుభాష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

చీకురాయి చౌరస్తా నుంచి మొదటి రైల్వే గేటు వరకు జరుగుతున్న డబుల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే విజయ రమణారావు, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు 3.5కోట్ల రూపాయలతో చేపట్టామని, అలాగే డ్రైనేజీ నిర్మాణానికి 40లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల రాకపోకలకు వీలుగా ఉంటుందన్నారు. అమృత్ 2.0 పథకంలో వాటర్ ట్యాంకులు నిర్మి స్తున్నామన్నారు. పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్ మున్సిపల్ సిబ్బంది మాజీ కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

సీఎం దిష్టిబొమ్మ దహనానికి బీజేపీ యత్నం

- పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట



రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కళ్యాణ్‌నగర్, అక్టోరు 10(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అంటూ కాంగ్రెస్ ప్రజలను మోసగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు.

పోలీసులు దిష్టిబొమ్మను లాక్కోవడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పోలీసులకు తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్ మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని, ఇటు జీఓ ఇచ్చినట్టే ఇచ్చి తమ సామాజికవర్గం వారితో కోర్టులో కేసు వేయించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాటకాలాడుతున్నారని, రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలను మోసంచేస్తే వారు రాజకీయంగా ఎదగలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి ప్రదర్శిస్తుందని, బీసీ రిజర్వేషన్లను అడ్డుకుం టున్నదని బీజేపీయే అని కాంగ్రెస్ బురద జల్లుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసి రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొండపర్తి సంజీవ్, పవన్, రాకేష్, భాస్కర్, రమేష్, రాయమల్లు, ఆకాష్, సునీల్, అంజి, శ్యామ్, నాగేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే బీసీలను నట్టేట ముంచారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నట్టేట ముంచిందని, కాంగ్రెస్ పార్టీ నయవంచన అని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాడు అధికారం కోసం బీసీ వాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్, నేడు నమ్మించిమోసం చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై 22నెలలుగా మసిబూసిమారేడు కాయచేసి నిండా ముంచిందన్నారు. ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం రిజ ర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టబద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్ రెడ్డి తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారని, బీసీలపట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు జీఓ ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారన్నారు. రాజ్యాంగ సవరణ లేకుండా అసెంబ్లీ తీర్మానంతో కోటా రాదని విపక్షాలు, విద్యావంతులు చెప్పినా వినకుండా ఎన్నికల నోటిఫికేషన్ దాకాతెచ్చి చివరకు కోర్టుముందు చేతులెత్తేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడాలని చెప్పారు. నాయకులు గోపు అయులయ్య యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, మాజీ జెడ్‌పీటీసీ నారాయణ, నాయకులు బొడ్డు రవీందర్, కల్వచర్ల కృష్ణవేణి, నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, మేతుకు దేవరాజ్, చల్లా రవీందర్‌రెడ్డి, మేడి సదానందం, పిల్లి రమేష్, తోకల రమేష్, నట్టు శ్రీనివాస్, బండారి ప్రవీణ్, తిమోతి, వెంకటేష్, ముద్దాసాని సంధ్యారెడ్డి, పాల్గొన్నారు.

పాత బస్టాండ్ పునరుద్ధరించాలి

- బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నీలకంఠ చెరువు సమీపంలో పెద్దరాత్ పల్లికి వెళ్లే రహదారిలో నిర్మించిన బస్టాండ్ నిర్మానుష్యం గా మారింది. మండల కేంద్రానికి రోజు జమ్మి కుంట, సుల్తానాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని నుంచి బస్సులు వస్తుంటాయి. బస్టాండ్ లేని కారణంగా ప్రయాణికులు రహదారి పైనే గం టల కొద్ది వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసరంగా సరైన టాయిలెట్లు, మంచి నీటి సౌకర్యం లేదు. చుట్టు పక్కల అన్ని దుకాణాలు, షాపులు ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి ఉక్కప ట్టుకోవా ల్సినదుస్థితి నెలకొంది. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు మరింత అసౌ కర్యంగా మారింది. దీనికి తోడుగా మోడల్ స్కూల్ విద్యార్థులు స్కూల్ బ్యాగు లతో గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. వా రికి శారీరకంగా పలు ఇబ్బందులు ఎదురవు తున్నా యని, వారి తల్లి తండ్రులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్, గోదావరిఖని, జమ్మికుంట తో పాటు పలు పట్టణాలకు వెళ్లే వారు కూడా ఇక్కడి నుండే బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. గతంలో నిర్మించిన బస్టాండ్ పశువుల కొట్టం గా మారింది. ప్రస్తుతం వచ్చి పోయే బస్సు మెయిన్ రోడ్డు పైనే నిలుపు తున్నారు. మెయిన్ రోడ్డుకు బస్టాండ్‌కు 200 మీటర్ల దూరంలో ఉన్నా బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో పశువులకు అడ్డాగా మారింది. వర్షా కాలం వస్తే చుట్టు పక్కల దుకాణాలలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. దుకాణదారులు షాపుల ఎదుట నిలబడ వద్దని పేర్కొంటున్నట్లు ప్రయా ణికులు వాపోతున్నారు. వేసవిలో ఎండలకు ప్రయాణికుల ఇబ్బంది పడుతున్నారు. నీలకంట చెరు వు సమీపంలో కనీసం రేకుల షెడ్డు వేసినా బాగుం టుందని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి చొరవ చూపాలని వారు పేర్కొంటున్నారు. బస్టాండ్ ఏర్పాటు కు ఎమ్మెల్యే కృషి చేయాలని లేదా పాతబస్టాండ్‌ను అందుబాటులోకి తెచ్చి బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



మండలం కేంద్రంలో రోడ్డుపైనే ఉన్న ప్రయాణికులు

పాతబస్టాండ్ అందుబాటులోకి తేవాలి

- జక్కుల కుమార్, కాల్వశ్రీరాంపూర్



మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు బస్సుల కోసం నిలబడాల్సిన దుస్థితి ఉంది. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కట్టిన పాత బస్టాండ్‌కు నిధులు వెచ్చించి అందుబాటులోకి తేవాలి.

బస్టాండ్ లేక ఇబ్బంది పడుతున్నాం

- కాసర్ల శ్రీనివాస్, కాల్వశ్రీరాంపూర్



బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బస్సులు మెయిన్ రోడ్డు పైనే నిలపడం వల్ల రహదారి పక్కన కనీసం కూర్చోవడానికి సౌకర్యం లేదు. ఎండ, వాన కాలం అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి పాత బస్టాండ్ పునరుద్ధరించాలి.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు సకాలంలో పూర్తి చేయాలి



గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

రామగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం మండలంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ 4వరుసల జాతీయ రహదారి నిర్మాణం సంబంధించిన మండలంలోని ఆదివారంపేట, బేగంపేట గ్రామాల్లో సిఎన్‌జి వరకు పూర్తి అయ్యిందని కలెక్టర్ తెలిపారు. మండలంలోని రెండు గ్రామాలలో రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి నిర్మాణ పని ప్రారంభమైందని, దీనిని సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ సుమన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సెంటినరీకాలనీలో యువకుడి దారుణ హత్య


చిరంజీవి(ఫైల్)

రామగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ నడిబొడ్డున శుక్రవారం పట్టపగలు యువకుడు దారుణహత్యకు గురైన ఘటన సంచలనం రేపింది. సెంటినరీకాలనీ సీటూ200 క్వార్టర్‌లో మహిళాసమైఖ్య కార్యాలయం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం న్యూమారేడుపాక పోతనకాలనీకి చెందిన కోట చిరంజీవి(36) మహిళా సమైఖ్య కార్యాలయాని(ఐకేపీ)కి వచ్చాడు. కార్యాలయం సమీపంలో కాపు కాసుకొని ఉన్న నల్గురు వ్యక్తులు కార్యాలయంలో ఉన్న చిరంజీవిని బయటకు లాగి కత్తులతో పొడిచి, రాడ్లతో దాడి చేయగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు కోట చిరంజీవి పోతనకాలనీలో మీ సేవా సెంటర్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. చిరంజీవి భార్య 2019లో మృతిచెందింది. పెంచికల్‌పేట్ గ్రామానికిచెందిన మహిళ, చిరంజీవి క్లాస్‌మెట్లు. పోతనకాలనీలో మీ సేవాకేంద్రాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో కంప్యూటర్ నేర్చుకోవడానికి మహిళ చిరంజీవి వద్దకు వెళ్లేది. వీరి పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే మహిళకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను, భర్తను వదిలి వస్తానని, పెళ్లి చేసుకోవాలని కోరింది. వద్దు నా పరువు పోతుందని చిరంజీవి వారించేవాడు. అయినా ఆమెతీరు మార్చుకోకుండా ఈవిషయం మాట్లాడేందుకు డీఆర్డీఏ(ఐకెపి) కార్యాలయానికి రావాలని హత్యకు ప్లాన్‌వేసింది. సెంటినరీకాలనీ వెళ్లిన చిరంజీవిని ఆమెభర్త కుమార్, అన్న అనవేననరేష్, తండ్రి అనవేన మల్లయ్య, బంధువు పిడుగు చందు.. కోట చిరంజీవిపై మారణాయుధాలతో కొట్టి హతమార్చారు. మృతుడి తమ్ముడు కోటా రామ్‌చరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఘటన స్థలాన్ని ఏసిపి మడత రమేశ్, మంథనిసీఐ రాజు, ఎస్ఐ శ్రీనివాస్ సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. పక్కా ప్రణాళిక ప్రకారం హత్యకు గురైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణ వెల్లడైయ్యింది. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జూలపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన బట్టు సురేష్ (40) శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేష్‌కు పదేళ్లక్రితం వివాహమైంది. భార్యభర్తల మధ్య వివాదంతో ఏడేళ్ల క్రితం భార్యకు విడాకులు ఇచ్చిన సురేష్ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. సురేష్‌కు సమీప బంధువు లక్ష్మణ్‌తో కొంత కాలంగా భూవివాదం నడుస్తోంది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో సురేష్‌పై కేసు నమోదైంది. దీంతో మానసికంగా కుంగిపోయి ఆందోళనకు గురైన సురేష్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

భర్త జైలులో.. దిగులుతో భార్య బలవన్మరణం


అన్వరీభేగం(ఫైల్)

మల్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా భర్త జైలులో ఉండడంతో పాటు ఒంటరితనం, ఆర్థిక సమస్యలతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో ఉండే అన్వరీభేగం(37) భర్త అబ్దుల్ రషీద్ కొన్నిరోజులుగా జైలులో ఉంటున్నాడు. దీంతో అన్వరీభేగం తరచూ దిగులు పడుతుండేది. అలాగే ఒంటరితనంతోపాటు ఆర్థికసమస్యలు వెంటాడుతుండడంతో జీవితంపై విరక్తిచెందిన ఆమె గురువారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. వెంటనే ఆమె కుమారుడు అఖిల్ చికిత్స కోసం జగిత్యాలకు తరలించగా అక్కడ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తంగళ్లపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవర్‌తోపాటు ప్రయాణికురాలు గాయపడింది.

ధ్వంసమవుతున్న గుట్టలు


కొమిర గుట్టపై ఉన్న శిథిలమైన నందీశ్వరుడు

- గుట్ట పై ఉన్న నందీశ్వరుడు, పాదాలు
- నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ క్వారీ

ఓదెల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి అందాలు, నీటి ఊటలు, వందేళ్ల చరిత్ర ఉన్న కొమిర, ఓదెల గుట్టలు ధ్వంసమవుతున్నాయి. చారిత్రాత్మక శిల్పాలు, విగ్రహాలు, గుహలు, కట్టడాలు ఉన్న చోట గ్రానైట్ క్వారీలకు లీజుకు ఇవ్వవద్దనే నిబంధన ఉంది. అయినప్పటికీ ఓదెల, కొమిర గుట్టలను లీజుకు ఇస్తుండడంతో పర్యావరణంతో పాటు విగ్రహాలు, గుహలు దెబ్బతింటున్నాయి. కొమిర గుట్టపై వందేళ్ల క్రితం నుంచి ఉంటున్న నందీశ్వరుని విగ్రహంతోపాటు రాముని పాదాలు క్వారీల వల్ల, గుర్తుతెలియని వ్యక్తుల వల్ల ధ్వంసమయ్యాయి. ఇదే గుట్టకు కింది భాగంలో ఉన్న చిన్నయ్య, పెద్దయ్య గుహ కూడా గ్రానైట్ క్వారీ వల్ల క్రమక్రమంగా ధ్వంస మవుతోంది.

చిన్నయ్య పెద్దయ్య గుట్ట..

వందేళ్ల క్రితం నుంచే చిన్నయ్య, పెద్దయ్య గుట్టగా పేరొందిన కొమిర గుట్ట అలరారుతోంది. అలాగే నీటి ఊటలతో, గుహలతో ఓదెల గుట్టకు చారిత్రాత్మకమైన ఉదంతం ఉంది. నాడు కరువుతో తల్లడిల్లుతున్న సమయంలో కొమిరకు చెందిన చిన్నయ్య, పెద్దయ్య ప్రజలకు నిలువ నీడను కల్పించడానికి గుట్టపై మొక్కల పెంపకాన్ని చేపట్టి, తాగునీటి కోసం గుహలు ఉపయోగించారని, ఫలాలతో గుట్ట ఆకలి దప్పికను తీర్చినట్లు చెబుతారు. గుట్టవద్ద యేటా చిన్నయ్య, పెద్దయ్య జాతర, వంటవార్పు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఓదెల, కొమిర, చిన్న కొమిర గ్రామాల ప్రజలు యేటా శ్రావణ మాసం ముందు చిన్నయ్య, పెద్దయ్య గుహకు చేరుకుంటారు. ముందుగా గుట్టలపై ఉన్న నందీశ్వరుడు, రాముని పాదాలను దర్శించుకొంటారు.


చిన్నయ్య పెద్దయ్య గుహ వద్ద భక్తుల పూజలు

కనుమరుగవుతున్న గుట్టలు

నిబంధనలను తుంగలో తొక్కుతున్న సంబంధిత శాఖ అధికారుల తప్పిదాల వల్ల గుట్టలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు గుట్టలు క్వారీ పేరుతో 10శాతం మేరకు ధ్వంసమయ్యాయి. దీంతో గుట్టల్లో ఉన్న నెమళ్లు, కుందేళ్లు, పక్షులు, తదితర వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు గుట్టలను లీజుకు ఇవ్వడం వల్ల ప్రజల విశ్వాసాలు దెబ్బతింటున్నాయి.

ఒక గుట్టకు మాత్రమే అనుమతి ఇచ్చాం
మైనింగ్ ఏడీ శ్రీనివాస్



చారిత్రాత్మకమైన గుట్ట ప్రాంతానికి గ్రానైట్ క్వారీ 200 మీటర్ల దూరం ఉండాలి. కేవలం ఓదెల గుట్టకు పది హెక్టార్లు (25 ఎకరాలు) మాత్రమే గ్రానైట్ క్వారీకి 20 ఏండ్లు అనుమతి ఇచ్చాం. కొమిర గుట్టకు ఎలాంటి అనుమతి లేదు. ఓదెల గుట్టకున్న ఊట గుహల ధ్వంసంపై పరిశీలిస్తాం. ప్రస్తుతం క్వారీ నిలిచిపోయింది. కొమిర గుట్టపై గ్రానైట్ క్వారీ అక్రమంగా కొనసాగితే చర్యలు తీసుకుంటాం.

చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు..
బోగే సదానందం సామాజిక కార్యకర్త, ఓదెల



క్వారీల కోసం ఓదెల కొమిర గుట్టలను గ్రానైట్ క్వారీకి లీజుకు ఇవ్వడంతో గుట్టపై ఉన్న చారిత్రాత్మక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. అధికారులు అనుమతులు రద్దుచేసి చిన్నయ్య పెద్దయ్య జాతరను నందీశ్వర విగ్రహం పాదముద్రికలను కాపాడాలి. కొందరు ప్రభుత్వానికి పన్నులు ఎగవేసి క్వారీలను నడుపుతున్నారు.

యువతిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తి అరెస్టు

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి డబ్బులు డిమాండ్‌చేసిన వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన చలేంద్ర వేణు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన పోలే ప్రశాంత్ అనే యువకుడు నుంచి ఓ యువతి వ్యక్తిగత ఫొటోలను తీసుకున్నాడు. సదరు యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫేక్ ఐడీని క్రియేట్ చేసి నిందితుడు మెసేజ్‌లు చేస్తూ రూ 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే ఆమె వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో సదరు యువతి షీ టీం పోలీసులను సంప్రదించింది. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా శుక్రవారం వేణును పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత తమ వ్యక్తిగత ఫొటోలను ఎవరికి ఇవ్వవద్దని, సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని సీఐ పేర్కొన్నారు. సీఐ వెంట చందుర్తి ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

బాల నేరస్థుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో దొంగతనాల కేసుల్లో వరంగల్ జువైనల్ హోంకు వెళ్లి వచ్చిన కరీంనగర్‌కు చెందిన బాల నేరస్థుడిని కరీంనగర్‌రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కరీంనగర్‌రూరల్ మండలం, ఎల్ఎండీ, కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో పలు ఫంక్షన్‌హాళ్లలోని డ్రెస్సింగ్‌రూంలలో చొరబడి బంగారు ఆభరణాలు చోరీ చేశాడని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈనెల8న కూడా ఒక ఫంక్షన్‌హాల్ డ్రెస్సింగ్‌రూంలో చొరబడి 4గ్రాముల బంగారు కమ్మలను చోరీచేశాడని, ఆ బంగారాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్టు చేశామని సీఐ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చిప్స్ షాపులో మంటలు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌వద్ద ఉన్న ఓచిప్స్ షాప్‌లో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దుకాణం బంద్ చేసిన తరువాత షార్ట్‌సర్క్యూట్ జరిగి అందులో ఉన్న తినుబండారాలు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఆస్తినష్టం జరిగినట్లుతెలుస్తోంది.

పేకాటరాయుళ్ల పట్టివేత

కోరుట్ల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని జిల్లా సీసీఎస్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. వారివద్ద రూ. 4,460 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

రెస్టారెంట్ సిబ్బందిపై దాడి..

- కేసు నమోదు

హుజూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న సిబ్బందిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. శుక్రవారం దీనిపై హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు. గురువారం రాత్రి రెస్టారెంట్ మూసివేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు భోజనానికి వచ్చారు. రెస్టారెంట్ మూసివేస్తామని తొందరగా వెళ్లాలని సిబ్బంది సూచించారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న సదరువ్యక్తులు ఆగ్రహానికి గురై సిబ్బందిపై దాడిచేసి వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, వారు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సదరువ్యక్తులు హుజూరాబాద్‌లోని పాతవాడకుచెందిన వారిగా గుర్తించారు.

పెన్షన్ ఇప్పిస్తానని.. పుస్తెలతాడు చోరీ


బాధితురాలు శంకరమ్మ

ధర్మారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నీకు పెన్షన్ మంజూరైంది, ఫొటో దిగితే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇప్పిస్తా అని ఓ వ్యక్తి వృద్ధురాలికి మాయమాటలు చెప్పి పుస్తెల తాడుతో పరారైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బుదారపు శంకరమ్మ(70) శుక్రవారం కూరగాయలు తేవడానికి వెళ్తుండగా ఆమెకు ఎదురుగా వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి శంకరమ్మకు దండం పెట్టాడు. నేను మీ గ్రామ కార్యదర్శిని అని పరిచయం చేసుకొని మాటల్లో దింపాడు. నేను మీ ఇంటికి వెళ్లి వస్తున్నాను, నీకు వస్తున్న రెండు వేల పెన్షన్ నాలుగు వేలు అయ్యిందని నమ్మబలికాడు. నా వెంట వచ్చి ఫొటో దిగితే నీకు పెన్షన్ డబ్బులు ఇస్తానని చెప్పి గాయత్రి బ్యాంకు ఎదురుగా ఉన్న సందులోకి తీసుకెళ్లి అక్కడే ఉన్న ఓ బెంచ్‌పై కూర్చోబెట్టాడు. ఫొటో తీస్తున్న క్రమంలో పుస్తెల తాడు ఉంటే పెన్షన్ రాదని, ఈ ఫొటో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపాలని చెప్పాడు. దీంతో ఆ మహిళ మెడలో నుంచి మూడు తులాల పుస్తెల తాడు అతని చేతిలో పెట్టగా డబ్బులు తెస్తానంటూ జారుకున్నాడు. ఎంతసేపటికీ మనిషి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి సదరు మహిళ లబోదిబోమంది. శంకరమ్మ ఫిర్యాదుతో పోలీసులు చౌరస్తాలోని ఓ మొబైల్ షాప్‌లో సీసీ కెమెరాను పరిశీలించగా శంకరమ్మతో మాట్లాతున్న ఆవ్యక్తి దృశ్యాలు రికార్డయ్యాయి. జరిగిన సంఘటన ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మాజీ ఎంపీపీ

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు చిలుక పెంటయ్య తన నిజాయితీని చాటుకున్నారు. గతసెప్టెంబరు 14వతేదీన గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌పే ద్వారా రూ.49850 జమయ్యాయి. ఆ డబ్బులు నగదును తీసుకెళ్లి చందుర్తి ఎస్ఐ రమేష్‌కు శుక్రవారం పెంటయ్య అప్పగించారు. ఆయనవెంట మాజీకోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా పెంటయ్యను, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు.

సర్వేను అడ్డుకున్నరైతులు

శంకరపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామశివారులో హైకోర్టు ఆర్డర్ మేరకు841,842 సర్వేనంబర్‌లను సర్వేచేయడానికి వచ్చిన ప్రభుత్వ సర్వేయర్‌ను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. సర్వే చేయించుకునే వ్యక్తికి రైతులమధ్యవాగ్వాదం చోటుచేసుకుంది. సదరువ్యక్తులు పోలీసులు, తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి తహసీల్దార్ సురేఖ, పోలీసులు చేరుకొని రైతులతో మాట్లాడారు. హైకోర్టు ఆర్డర్ మేరకు సర్వేయర్ సర్వే నంబర్ కేటాయించడానికి వచ్చినట్లు తహసీల్దార్ సదరు రైతులకు వివరించారు. సాయంత్రం కావడంతో సర్వేచేయకుండా తహసీల్దార్, సర్వేయర్ అక్కడినుంచి వెళ్లిపోయారు.

ఏసీబీకి పట్టుబడిన మధురానగర్ కార్యదర్శి

- ఇందిరమ్మ ఇంటి బిల్లు మంజూరుకు లంచం డిమాండ్
- పదివేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు


ఏసీబీకి పట్టుబడిన మధురానగర్ కార్యదర్శి అనిల్

గంగాధర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గంగాధరమండలం మధురానగర్ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధురానగర్ గ్రామపరిధిలోని పత్తికుంటపల్లికి చెందిన గంగాధర లాస్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటిపనులు బేస్‌మెంట్ లెవల్ పూర్తికాగానే మొదటిబిల్లు లక్ష నెలరోజులక్రితం ఆమె ఖాతాలో జమైంది. బిల్లు వచ్చినప్పటినుంచి గ్రామకార్యదర్శి అనిల్ పదివేలు ఇందిరమ్మ ఇంటిబిల్లు కోసం ఖర్చులకు ఇవ్వాలని వేధిస్తున్నాడు. రెండుమూడు మార్లు పైసల కోసం ఇంటికి సైతం వెళ్లాడు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి లంచం ఇవ్వలేనంటూ లబ్ధిదారురాలి భర్త శ్రీకాంత్ కార్యదర్శికి తెగేసి చెప్పాడు. అయినా కార్యదర్శి లంచం కోసం వేధిస్తుండటంతో శ్రీకాంత్ కరీంనగర్‌లోని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్‌ను సంప్రదించాడు. ప్రణాళిక ప్రకారం శుక్రవారం గ్రామపంచాయతీలో కార్యదర్శి అనిల్ పదివేలను గంగాధర శ్రీకాంత్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గ్రామ రికార్డులను పరిశీలించి, సదరు అవినీతి కార్యదర్శిని ఏసీబీకోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్‌తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా పనుల నిమిత్తం డబ్బులు ఇవ్వాలని అడిగినట్లయితే టోల్‌ఫ్రీ నంబరు 1064కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు

- చెట్టును ఢీకొన్న కారు
- బోల్తా పడిన ప్యాసింజర్ ఆటో
- నలుగురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు


చెట్టును ఢీకొన్న కారులో గాయాలతో యువకులు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మెట్‌పల్లి, కోరుట్ల మధ్యలోని జాతీయరహదారిపై గురువారం అర్ధరాత్రి గంటల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన ఏడుగురు స్నేహితులు టీఎస్05ఈజే 4214నంబర్‌గల కారులో టీతాగడానికి మండలంలోని మారుతీనగర్ శివారులోని హోటల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పెద్దాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు రహదారికి పక్కన ఉన్న చెట్టును కారు ఢీకొట్టింది. అందులో ఉన్న అవేస్, ఫయాజ్, మౌలానా ఆమెర్, సమీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. మరో ముగ్గురు సైఫ్, ఫుర్ఖాన్, కైఫ్‌లకు స్వల్ప గాయాలుకావడంతో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా మారుతీనగర్ శివారులోని పెద్దగుండువద్ద కారు, టాటా మ్యాజిక్ ప్యాసింజర్ ఆటోలు ఢీకొనంగా అందులో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

ఒకే వాహనంపై 277 పెండింగ్ చలాన్లు

- మొత్తం విలువ రూ.79,845



పెండింగ్ చలాన్లు ఉన్న వాహనం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలకు పైగా 277 పెండింగ్ ట్రాఫిక్‌చలాన్లు పేరుకుపోయిన మోటార్ సైకిల్‌ను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని సిక్కువాడీ ప్రాంతంలో సాధారణ ట్రాఫిక్ నియంత్రణ, పెట్రోలింగ్‌విధుల్లో ఉన్న ఇన్స్‌పెక్టర్ పి రమేష్, ట్రాఫిక్-2, కానిస్టేబుల్ జి శ్రీనివాస్‌రావు బృందంతనిఖీల్లో హీరో యూనికార్న్ మోటార్ సైకిల్ టిఎస్ 02ఇఎక్స్ 1395 నెంబర్ గల వాహనాన్ని పట్టుకున్నారు. 2019 సంవత్సరం జూన్ 8వ తేదీ నుంచి డిసెంబర్ 25 2024 మధ్య కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో 277పెండింగ్ చలాన్లతో 79,845రూపాయల ఫైన్ ఉన్నది. వాహనం నడుపుతున్న వ్యక్తి కరీంనగర్‌లోని గోదాంగడ్డకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్(37) ఆర్ఎంపీ ప్రాక్టిషనర్‌గా గుర్తించారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

- కరీంనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 264 చలాన్లు

మొత్తం 277 చలాన్లలో ఎక్కువ భాగంగా కరీంనగర్ ట్రాఫిక్ పిఎస్ పరిధిలో 264 నమోదయ్యాయి. 277 చలాన్లలో 254 హెల్మెట్ లేకుండా, ఫేస్ మాస్క్ ధరించకపోవడం 10, ట్రిపుల్ రైడింగ్ 7, సెల్‌ఫోన్ రైడింగ్ 2, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకెళ్లకపోవడం 2, నంబర్ ప్లేట్ సరిగా లేకపోవడం 1, జిగ్‌జాగ్ డ్రైవింగ్ 1 నమోదయ్యాయి.

- చలాన్ల వసూలుకు చట్ట పరమైన చర్యలు

- యాదగిరిస్వామి, అసిస్టెంట్ పోలీస్‌కమిషనర్ (ట్రాఫిక్)

వాహనంపై నమోదైన చలాన్లు రూ.79,845లు వసూలు చేయడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌నియమాల ఉల్లంఘనపై వాహనదారులు చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తాం. వాహనం స్వాధీనం చేసుకున్నాం. వాహనయజమానులు పెండింగ్‌లో ఉన్న చలాన్‌లను వెంటనే క్లియర్ చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

తిమ్మాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీవద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతిచెందింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండల కేంద్రానికి చెందిన ఇప్పలపల్లి రవళిక(23), దీకొండ వెంకటసాయి హైదారాబాద్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం ఇద్దరు కలిసి హైదారాబాద్ నుంచి గంగాధరకు వారి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నారు. అతివేగంగా ఉన్న బైక్ అదుపుతప్పి ఎల్ఎండీ కాలనీవద్ద రవళిక రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని పోయిందని దీంతో ప్రమాదం జరిగిందని బైక్ నడుపుతున్న వెంకటసాయి పోలీసులకు తెలిపాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.


ఘటన స్థలంలో మృతిచెందిన రవళిక

మెటాఫండ్ ప్రో యాప్ కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో, మెటాఫండ్ ప్రో యాప్ కేసులో జగిత్యాల పట్టణానికి చెందిన కస్తూరి రాకేష్, కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, వీరబత్తిని రాజును అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అధిక వడ్డీ ఆశ చూపి నిందితులు మెటాఫండ్ ప్రో అనే యాప్‌లో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే మూడు లక్షల రూపాయలు వస్తాయని ఆశచూపి గొలుసుకట్టు గొలుసు కట్టు వ్యాపారం చేశారన్నారు. కొడిమ్యాల మండలానికి చెందిన ముగ్గురి నుంచి 20 లక్షల రూపాయలు వసూలు చేశారని అన్నారు. పెట్టిన డబ్బుకు మూడు వంతులు వస్తుందని ఆశ చూపడంతో పాటు సింగపూర్, దుబాయ్ లాంటి దేశాలకు తీసుకెళ్తామని ఆశ చూపారని ఎస్పీ తెలిపారు. మెటా ఫండ్ మూసివేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 8వ తేదీన వీరబత్తిని రాజు, సింగిరెడ్డి తిరుపతి రెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపగా శుక్రవారం కస్తూరి రాకేష్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- చెలరేగిన మంటలు..
- దగ్ధమైన కారు..

చిగురుమామిడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ శివారులో ఉన్న పెసరుపల్లిలో శుక్రవారం రాత్రి ఓకారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టి కాలిపోయింది. ఏఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు జనగాం నుంచి ప్రశాంత్, సతీష్, నవీన్ అనేముగ్గురు యువకులు కొండగట్టు దైవదర్శనానికి కారులో బయలుదేరారు. ఈక్రమంలో పెసరుపల్లి శివారులో ఉన్న మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. వెంటనే కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో యువకులు బయటపడ్డారు. అనంతరం కారులో మంటలుచెలరేగి పూర్తిగా దగ్ధమైంది. కారు బెలూన్స్ ఓపెన్‌కాకపోతే ప్రాణనష్టం జరిగేదని, ఇతర ప్రయాణికులకు సైతం ఇబ్బంది ఉండేదని స్థానికులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.



బూజుపట్టిన లడ్డూ ప్రసాదాన్ని చూపుతున్న నేతలు

రాజన్న లడ్డూల తయారీలో నాణ్యత లోపం..

● లడ్డూల కౌంటర్‌ను పరిశీలించిన బీజేపీ నేతలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తయారు చేసే లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించిందని బీజేపీ వేములవాడ పట్టణ నేతలు ఆరోపించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాదం కౌంటర్‌కు వెళ్లిన బీజేపీ నేతలు శ్రీధర్, శేఖర్, శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించిందని భక్తులు నుంచి వచ్చిన ఫిర్యాదుతో రాజన్న ఆలయ ప్రసాదాల కౌంటర్‌కు వెళ్లి పరిశీలించామని, లడ్డూలు బూజు పట్టి దుర్వాసన వస్తున్నాయని గుర్తించినట్లు తెలిపారు. అంతే కాకుండా రాజన్న ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు సైతం లడ్డూ ప్రసాదం దుర్వాసన వచ్చిందని చెప్పిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ విషయంపై ఏఈవో స్పందిస్తూ రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధిలో భాగంగా తయారీ కేంద్రం కూల్చివేశామని, అందులో భాగంగానే భక్తులకు లడ్డూలు తక్కువగా ఇవ్వకుండా ఉండేందుకు ఎక్కువగా తయారీ చేస్తున్నామని, రెండు రోజులుగా వర్షం కారణంగా లడ్డూ తేమ ఆరకపోవడంతో దుర్వాసన వచ్చి ఉండవచ్చని వివరణ ఇచ్చారు.

కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు..

ఆలయ ఈవో రమాదేవి

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు నాణ్యమైన లడ్డూలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నా మని, కావాలని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నా రని ఈవో రమాదేవి అన్నారు. లడ్డూ ప్రసాదం నాణ్యతాలోపం, దుర్వాసనపై వచ్చిన ఆరోపణలపై ఆమె స్పందించారు. కొంత మంది ఉదయం నుంచి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారని, లడ్డూ ప్రసాదం దుర్వాసన వస్తోందని మీడియాకు ఫోన్ చేశారని తెలిసిందన్నారు. ఆలయ విస్తరణలో భాగంగా ప్రసాదాల తయారీ విభాగం వేరేచోట ఏర్పాటు చేశామన్నారు. లడ్డూలు నాణ్యత లోపించిందని తమ దృష్టికి రావడంతో వెంటనే విచారణ చేపట్టామన్నారు. పాత



కౌంటర్‌లో లడ్డులను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

ఆంధ్రబ్యాంకులో నిల్వ ఉన్న లడ్డూల పాత ట్రేలను ప్రసాదాల కౌంటర్ వద్ద ఏర్పాటు చేశామని, అట్టి ట్రేలు వాడకుండా నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తున్నాయన్నారు. లడ్డూ ప్రసాదం దుర్వాసన రావడంపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేస్తున్నామన్నారు. వెంటనే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు విచారణ నిమిత్తం శాంపిల్ పంపించామని ఉన్నతాధికారులకు తెలియజేశామని వివరించారు.

లడ్డూ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి ఆరా..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంలో లడ్డూ ప్రసాదం నాణ్యత లోపం, దుర్వాసన వస్తుందన్న ఘటనపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆరా తీసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన సమగ్ర విషయాలు అందజేయాలని టెంపుల్ అధికారులను ఆదేశించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు లేఖ సిఫారసు చేసి విషయాలను, ఎక్కడ ఎటువంటి లోపం జరగలేదని, అయినా భక్తుల మనో భావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎటువంటి తప్పిదాలు జరగొద్దని, జాగ్రత్తగా ఉండాలని, ఆలయ ప్రతిష్ఠకు సంబం ధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం

మానకొండూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్‌జిల్లాస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం అయ్యాయి. ఉమ్మడికరీంనగర్ సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్‌జూనియర్, సబ్‌జూనియర్ బాలబాలికలకు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11,12వ తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి విజయ బాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కరుణాకర్‌రెడ్డి, జస్బీర్‌సింగ్, రాజేశ్ టీ షర్టులు పంపిణీ చేశారు.

ఎస్సారెస్పీకి 75,394 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం శుక్రవారం స్వల్పంగా పెరిగింది. 21 గేట్లు పైకి ఎత్తి 65,604 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 75,394 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలకడగా ఎల్ఎండీ నీటి మట్టం

తిమ్మాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2వేలు, మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 277క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతోంది. మోయ తుమ్మెదవాగు నుంచి 1077క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 1500క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 198క్యూసెక్కులు మొత్తం 2775క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.818టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కలగానే మినీ స్టేడియం

నత్తనడకన కొనసాగుతున్న నిర్మాణ పనులు

విద్యార్థులు, క్రీడాకారులకు తప్పని ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు, యువతీయువకులు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో మంజూరు చేసిన మినీ స్టేడియం నిర్మాణ పనులు నత్తనడక కొనసాగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆధునిక వసతులతో మినీస్టేడియం అందుబాటులోకి రానుందని ఆశించిన విద్యార్థులు, క్రీడాకారులకు కలగానే మిగిలిపోతోంది. సాధన చేయడానికి అనువైన మైదానాలు, ఆట స్థలాలు, సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మినీస్టేడియం మంజూరై రెండేళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాకపోవడం వల్ల క్రీడాకారులు, విద్యార్థులు అసౌకర్యాల నడుమ సాధన చేయాల్సి వస్తోంది. అరకొర వసతుల మధ్య శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే తాము మరింత నైపుణ్యంతో అంత ర్జాతీయ క్రీడల్లో రాణిస్తామని పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు..

మండలంలోని విద్యార్థులు, క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు రూ.కోటి నిధులను కేటాయించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణాన్ని చేపట్టారు. మినీ స్టేడియంలో గ్యాలరీ, ఫ్లడ్ లైట్లు, ప్రహరీ గోడ, ఆర్చీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.43 లక్షలు ఖర్చు చేశారు. సకాలంలో బిల్లులు మంజూరుకాకపోవడం వల్ల పనులను నిలిపివేశారు. యేడాదిగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల బిల్లు చెల్లించడంతో తిరిగి పనులను ప్రారంభించారు. గ్యాలరీ, ఆర్చీ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

స్థల వివాదం.. నిలిచిన ప్రహరీ..

మినీ స్టేడియం నిర్మాణ పనుల్లో భాగంగా ప్రహరీ పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారు. ప్రహరీ స్థల వివాదం నెలకొనడం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పనులను పరిశీలించి స్థల వివాదాన్ని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఆటలకు ఇబ్బందులే..

మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులతో పాటు క్రీడాకారులు సుమారు 5వేల మంది ఉన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నా.. సాధన చేయడానికి సరైన సదుపాయాలు, మైదానాలు అం దుబాటులో లేవు. ఆటవీ, పోలీసు, ఆర్మీ ఉద్యోగా లు సాధించాలనుకునే నిరుద్యోగ యువత సాధన చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం తో పాటు వెంకటాపూర్, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి, నారాయణపూర్, రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని మైదానాల్లో సాధన చేస్తున్నారు. పలువురు ఖాళీగా ఉన్న వ్యవసాయ భూములు, ఇళ్ల ఎదుట సాధన చేస్తూ లక్ష్యం వైపు ముందుకు సాగుతున్నారు. మండల స్థాయి క్రీడాపోటీలను మండల కేంద్రంలోని గిద్దె చెరువు సమీపంలో ఉన్న పల్లెప్రకృతి వనంలో అరకొర సౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఉన్నా.. సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ స్టేడియం పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, క్రీడాకారులు కోరుతున్నారు.



ఓ పాఠశాల ఖాళీ స్థలంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

కొనసాగుతున్న మినీ స్టేడియం నిర్మాణ పనులు

మైదానం లేక ఆడలేకపోతున్నాం..

: నాగరాజు, విద్యార్థి, ఎల్లారెడ్డిపేట



ఆటలు ఆడాలన్న ఉత్సాహం ఉన్నా మైదానం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఖాళీ స్థలాల్లో ఆడుకుకోవాల్సి వస్తోంది. మినీ స్టేడియం పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు వస్తే క్రీడల్లో సత్తా చాటుతాం.

ఆటలకు దూరంగా ఉంటున్నాం: రేవతి, విద్యార్థిని, ఎల్లారెడ్డిపేట



మినీ స్టేడియం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులను పూర్తిచేసి సదుపాయాలను కల్పించాలి. ఆటలు ఆడేం దుకు స్థలం లేకపోవడంతో దూరంగా ఉంటున్నాం. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ ఉన్నా సౌకర్యాలు లేక రాణించలేకపోతున్నాం. అధికారులు పట్టించుకుని పనులను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలి.

భూ సేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూసేకరణకు తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలాసత్పతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ రహదారి సంస్థ, వరంగల్ ప్రాజెక్టు సంచాలకుడు భరద్వాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేశ్‌బాబుతో కలెక్టర్ పమేలా సత్పతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ భరద్వాజ్ పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని త్వరితగతిన పరిష్కరించి, జాతీయ రహదారి సంస్థకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నేషనల్ హైవే అథార్టీ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫిజీషియన్ల సదస్సును కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో శని,ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఇండియా జిల్లా బాధ్యులు డాక్టర్ విజయ్ మోహన్‌రెడ్డి, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ రఘురామన్ తెలిపారు. శుక్రవా రం నగరంలోని ఐఎంఏ హాలులో రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ రాష్ట్ర సదస్సులో వైద్య రంగంలో వస్తున్న అధునాతన వైద్య విధానం, చికిత్స, పరికరాలు, మందుల పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రతీ వైద్యుడు నూతన వైద్య విధానాన్ని నేర్చుకోవాలన్నారు. అందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.చైతన్యరెడ్డి, సంజయ్, జె.సురేష్, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, వడ్డె బోయిన లక్ష్మణ్, నవీన, పద్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు

వేములవాడ రాజన్నకు భక్తుల నీరాజనాలు



వేములవాడ ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారికి భక్తులు నీరాజనాలు పలికారు. శుక్రవారం ఉదయం ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేములవాడ రాజ రాజేశ్వర స్వామివారి ఆలయ అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్ సోమాజి గూడకు చెందిన నీలగిరి శంకరరావు కుటుంబ సభ్యులు రూ. లక్షా 11వేల 111 చెక్కును ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అంద జేశారు.

నేడు భీమేశ్వర ఆలయంలో పూజలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధిలో భాగంగా జరిగే మార్పుల దృష్ట్యా భీమేశ్వర ఆలయంలో చేపట్టే దర్శనాలకు పూజలు శనివారం ప్రారంభించనున్నట్లు ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయ ప్రధానార్చకులు, ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేష్ శర్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు శ్రీభీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భీమేశ్వర ఆలయంలో స్వామి వారి కైంకర్యములు ప్రారంభించు ప్రదేశములకు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

భీమేశ్వర ఆలయానికి ఉత్సవమూర్తుల తరలింపు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం నుంచి అర్చక పరివారంతో శనివారం ఉదయం 8.30 గంటలకు పల్లకీసేవలో ఉత్సవమూర్తులను శ్రీభీమేశ్వర ఆలయానికి తరలించనున్నట్లు ఈవో తెలిపారు. అనంతరం పూజాకార్యక్రమాలు చేపటన్నునున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ● ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు స్పందన





కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు ప్రతిభచాటారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ గోవింద కృష్ణ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ వేణుకుమార్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకుడు గుంటపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి బాబు, కోచ్‌లు మధుకర్, నామ రమేష్, వెంకటేష్, ముస్తాక్, గంగరాజు, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, శ్రీనివాస్, రాజు నాయక్, నారాయణ పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీల విజేతలు

● విజేతలు వీరే...

బాలికల విభాగంలో ఎన్.ఇరాన్యశ్రీ, వినూతన, సిరిచందన, అక్షితరెడ్డి, బాలుర విభాగంలో ఎస్.హర్షవర్ధన్, డి.శ్రీచరణ్ విజేతలుగా నిలిచారు. కె.వైభవ్, శ్రీమర్ష, మహ్మద్ రాయల్, శౌర్యతేజ కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు.

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలకు ఎంపిక

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగం కబడ్డీలో మనిషా, ఖోఖోలో రేవతి, సంజన, వాలీబాల్‌లో దర్శిని, అక్షయ, అక్షిత, అండర్-14 విభాగం కబడ్డీలో యశశ్విని, హారిక, ఖోఖోలో సంజన జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో రైతుల ధర్నా

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా వచ్చి పాత బస్టాండ్ వద్ద రైతుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు సన్న బియ్యానికి బోనస్ విడుదల చేయాలని, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర 2,420 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో జాతీయ రహదారిపై కాసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధర్నా విరమించాలని మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌లు రైతులను నచ్చ



ఎంపీడీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన

మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతికి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ధరలు తగ్గించి 1,600 రూపాయలకే కొనుగోలు చేస్తూ రైతులను నట్టేటా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సీజన్‌లో జెప్పినా వినలేదు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన రైతులు, రైతు ఐక్య వేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన

పందుల నుంచి పంటలు కాపాడండి

గంగాధర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పం టలను ధ్వంసం చేస్తున్న పందుల నుంచి కాపాడాలని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాల యాల ఎదుట గంగాధర రైతు లు నిరసన చేపట్టారు. గంగాధర గ్రామపరిధిలో పదుల సంఖ్యలో పందులు గుంపులుగా పంటలపై పడి నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి, పగలు తేడాలేకుండా వరి, కూరగాయలు, ఇతర పంటలను పాడు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంపులుగా వస్తున్న పందులు ఒంటరిగా ఉన్న రైతులపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారులు కలుగజేసుకుని పందుల నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

వైభవంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని గణపతి ఆలయంలో శుక్రవారం అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ద్యావళ్ల కిరణ్, శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీపై నీలినీడలు

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. ఇప్పటికే నెల 15 రోజుల ఆలస్యం కావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. చేప పిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందా, లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే చేప పిల్లలకు బదులు నగదు పంపిణీ చేస్తే తాము వాటిని కొనుగోలు చేసి చెరువుల్లో వేసుకుంటామని మత్స్యకారులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాగినేడు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలితం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు, రాగినేడు సబ్ స్టేషన్ పరిధిలో రాగినేడు, కనగర్తి, కాపులపల్లి, బ్రాహ్మణపల్లి, అందుగులపల్లి, కుర్మపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. రంగంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పెద్దబొంకూర్, పెద్దకల్వల, నిట్టూరు, పెద్దపల్లి, రంగంపల్లి, నిమ్మనపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుండి 10.30 వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

గోదావరిఖనిలో...

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్ల మరమ్మతులో భాగంగా శనివారం గోదావరిఖనిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాంమందిర్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్, ఓల్డ్ అశోక టాకీస్, మేదరిబస్తీ, కళ్యాణ్‌నగర్, మారుతినగర్ ఎల్‌బీనగర్, సీతానగర్, రాంనగర్, వినోభానగర్, విద్యనగర్, ఫైవింక్లయిన్, పరుశరాంనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. గౌతమినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 10గంటల వరకు గౌతమినగర్, సంజయ్‌గాంధీనగర్, చంద్రశేఖర్‌నగర్ ఏరియాల్లో ఆటంకం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచార హక్కు చట్టాన్ని గౌరవించాలి

కోల్‌సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ సమాచారాన్ని సకాలంలో అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ అన్నారు. సమాచార హక్కు వారోత్సవాల సందర్భంగా శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా అందించాలన్నారు. స్వచ్ఛందంగా సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉండేలా వ్యవహరిస్తామని, పనితీరులో పారదర్శకత పాటిస్తామని సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. రోడ్లు, భవ నాలశాఖ జగిత్యాల డివిజన్ సూపరింటెండెంట్, ఆర్‌టీఐ రిసోర్స్‌పర్సన్ కిషన్, సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అడిషనల్ కమిష నర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, సెక్రటరీ ఉమామహేశ్వర్‌రావు, ఏసీపీ శ్రీహరి, ఆర్‌ఓ అంజనేయులు, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా టీఎంసీ మౌనిక, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీటౌన్,(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో వజ్రాయుధం లాంటిదని, ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల పారదర్శక పాలనను సాధించవచ్చని ఆర్‌టీఐ రాష్ట్ర ఆర్గనైజేషన్ కన్వీనర్ వెంకటేశ్వర్లు అన్నారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మార్కండేయకాలనీ లోని ట్రినిటీ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టం 20 సంవత్సరాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యత-ప్రజాస్వామ్యంలో పౌరుని హక్కులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ విభాగాల కార్యకలాపాలపై స్పష్టమైన సమాచారం తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. నియోజకవర్గం కన్వీనర్ ఎం.రాజేశం, కోకన్వీనర్లు పిట్టల రాజ్‌కుమార్, మహ్మద్ తాజోద్దీన్‌బాబా, రాష్ట్ర మహిళా కోకన్వీనర్ సోమలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ కె.యుగంధర్, కమిటీ సభ్యులు సురేష్, చిరంజీవి, శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌టీఐ రాష్ట్ర ఆర్గనైజేషన్ కన్వీనర్ వెంకటేశ్వర్లు

ట్రేడ్ లైసెన్స్ లేకుండా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు

కోల్‌సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా సీజనల్ వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. బాణాసంచా, ఉన్ని దుస్తుల విక్రయాలకు ఆన్‌లైన్‌లో తాత్కాలికంగా ట్రేడ్ లైసెన్స్ పొందడానికి అవకాశం ఉందని, దుకాణాల వివరాలు కొలతలు నమోదు చేసి, ఫొటో అప్‌లోడ్ చేసిన తరువాత జనరేట్ అయిన బిల్లు చెల్లిస్తే తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ జారీ అవుతుందని, సీజనల్ వ్యాపారాలు చేసేవారు కార్యాలయానికి రాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేయండి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ ముదిరాజ్ కులస్థుల సంక్షేమానికి కృషి చేయాలని జిట్టవేని ప్రశాంత్, గొసుల సుజాత కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో చైర్మన్‌గా వ్యవహరించిన సబ్బు మల్లయ్య ఆలయానికి సంబంధించిన లెక్కలు అప్పగించాలని డిమాండ్ చేశారు. సబ్బు మల్లయ్య ముదిరాజ్‌లను విస్మరించారని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. బాధ్యతలు చేపట్టిన కమిటీకి సహకారాన్ని అందించాలని, గతంలో ఆలయానికి వచ్చిన లెక్కలను చెప్పాలని కోరారు. రాజయ్య, పిట్టల అంజయ్య, సమ్మయ్య, శ్రీకాంత్, రాజేందర్, రవీందర్, హన్మంతు, రమేష్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కెమెరాలు ప్రారంభిస్తున్న జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి

సుల్తానాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లోని ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాన్ని క్రీడాకారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి సురేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం జిల్లా క్రీడల అధికారి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో గత సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే ఖోఖోలో శిక్షణ ఇస్తున్నామని, అంతర్జాతీయ క్రీడాకారుడు గెల్లు మధుకర్‌చే శిక్షణ ఇస్తున్నారన్నారు. మైదానంలో నాలుగు వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, గెల్లు మధుకర్ యాదవ్‌తోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే హంగామా



అలరించిన విద్యార్థినుల నృత్యాలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. డీఐఈవో కల్పన మాట్లాడుతూ చదువులపై శ్రద్ధ కనబరిచి, ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని కోరారు. తాత్కాలిక ఆనందాల వైపు మొగ్గు చూపకుండా సెల్‌ఫోన్‌లను చదువు కోసం, విజ్ఞానం పెంచుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నరహరి, లెక్చరర్లు సంతోష్ రెడ్డి, అశోక్, రామకృష్ణ, కుమారస్వామి, రమాదేవి, ప్రసూన, అశ్విని, శ్రీలత, దీపా, సౌజన్య, నవ్య, పుష్పలతతోపాటు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

మంథని, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్ల పేరుతో రాష్ట్రంలోని బీసీ సమాజాన్ని రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. శుక్రవారం జ్యోతిబాపూలే విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం పుట్ట మధు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ఎన్నికల ముందు కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. బీసీ డిక్లరేషన్ 42 శాతం బీసీలకు రిజర్వేషన్ మాత్రమే కాదని, అందులో ఉన్న అనేక అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 22 నెలలు గడుస్తున్నా ఒక్క హామీ అమలు చేయకుండా బీసీలను మోసం చేస్తున్నారన్నారు. బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండ సురేఖ, వాకట శ్రీహరిలు సైతం సీఎం రేవంత్‌రెడ్డి, కమిటీ చైర్మన్ మంత్రి శ్రీధర్‌బాబుకు మద్దతుగా నిలుస్తుండటం విచారకమన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను బీసీ సమాజం అర్థం చేసుకొని రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

బీఆర్‌ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, జక్కు రాకేష్, గుజ్జుల రాజిరెడ్డి, పోతిపెద్ది కిషన్‌రెడ్డి, గొబ్బూరి వంశీ, పుప్పాల తిరుపతి, కనవేన శ్రీనివాస్, కుమార్, సమ్మయ్య, రాజబాబులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలులో ప్రభుత్వం విఫలం

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ నాయకులతో కలిసి రాస్తారోకో చేశారు. మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎలక్షన్‌లలో 42 శాతం బీసీ కులాలకు రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, సీనియర్ నాయకులు దండే లక్ష్మీనారాయణ, మట్ట శంకర్, మొండయ్య, పోశం, జంగపల్లి అజయ్, అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని దగా చేసిందని, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఆరోపించారు. కమాన్‌పూర్ క్రాస్‌రోడ్డు వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఇళ్ల వద్దకు వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. తోట రాజ్ కుమార్, తాటికొండ శంకర్, బొమ్మగాని అనిల్ గౌడ్, రాచకొండ రవి, ఆకుల గట్టయ్య, వెంకటేష్, పల్లె నారాయణ, పోలుదాసరి సాయికుమార్, తిరుపతి పాల్గొన్నారు.

ఎన్టీపీసీ గుర్తింపు సంఘం కార్యవర్గం



సాగర్ రాజు


జ్యోతినగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ గుర్తింపు యూనియన్ ఎన్టీపీసీ కార్మిక సంఘ్(బీఎంఎస్) కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా నన్నపురాజు సాగర్‌రాజు, అధ్యక్షుడిగా కె.భాస్కర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.మహేశ్‌లను ఎన్నుకున్నారు. అడ్వయిజర్‌గా ఉపేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా సి.రంజిత్‌కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరిగా సిహెచ్.సత్యనారాయణ రెడ్డి, వెల్ఫేర్ సెక్రెటరీగా ఎ.వెంకటయ్య, కోశాధికారిగా బి.రాజశేఖర్‌లతోపాటు 11 మంది ఉపాధ్యక్షులు, 11 మంది కార్యదర్శులు, నలుగురు ఆర్గనైజింగ్ కార్యదర్శులు, నలుగురు కమిటీ సభ్యులను నియమించారు. గత నెల 25న జరిగిన ఎన్టీపీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో బీఎంఎస్ గెలిచిన విషయం తెల్సిందే. 49 శాతం ఓట్లు సాధించిన బీఎంఎస్‌కు ఒక ఎన్‌బీసీ సభ్యుడిని కేటాయించారు. ప్రధాన కార్యదర్శిగా సాగర్‌రాజు వ్యవహరించనున్నారు.

గ్రూప్-2 లో ఎంపీవోగా ఎంపిక

ఓదెల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పిట్టల ఎల్లయ్యపల్లికి చెందిన పవన్ కుమార్ గ్రూప్-2లో ఎంపీఓగా ఎంపికయ్యారు. పిట్టల ఎల్లయ్యపల్లికి చెందిన సాగర్, పద్మల కుమారుడైన పవన్ కుమార్ గ్రూప్ 4లో ఉద్యోగం సాధించి కలెక్టరేట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పవన్ కుమార్ గ్రూప్-2 పరీక్షలు రాయగా వారం రోజుల క్రితం ప్రకటించిన గ్రూప్ 2 ఫలితాల్లో ఎంపిక ఇవ్వడంపై గ్రామస్థులతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సీహెచ్‌పీ సమస్యలను పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 సీహెచ్‌పీలో సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ బృందం సీహెచ్‌పీని సందర్శించి కార్మికులను సమస్యలు తెలుసుకున్నారు. ఫ్లో ఫీడర్‌లో పొగతో కార్మికులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు నాయకులు తెలిపారు. మోకాళ్ల లోతు బురదలో యాజమాన్యం పనులు చేయించడం సరికాదన్నారు. ప్రమాదం జరిగితే తప్పించుకునే అవకాశం లేకుండా ఉన్న ప్రదేశాల్లో కార్మికులు ఎలా పని చేస్తారో యాజమాన్యం ఆలోచించాలని పేర్కొన్నారు. ఫైర్ కోల్ కారణంగా బంకర్స్ దెబ్బతిని నేరుగా బొగ్గుబెల్ట్ మీద పడడంతో కార్మికులకు గాయాలు అవుతున్నాయని తెలిపారు. ఫైర్ కోల్ సీహెచ్‌పీ వరకు రాకుండా వాటర్ పాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టెండాల్ యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. రవీందర్, గంధం సాంబశివరావు, సెగ్గెం శంకర్, అల్లి రమేష్, రాజశేఖర్, శ్రీనివాస్, తిరుపతి, అంజయ్య, బుర్ర రమేష్, శంకర్, పిట్టల రమేష్ పాల్గొన్నారు.



కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌వోటూజీఎం

రామగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధి సెంటినరీకాలనీలో శుక్రవారం రీజినల్ స్థాయి కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఆర్జీ-3 ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నాయకులు వై.వీరావు, బెల్లం శ్రీనివాస్, అధికారులు సుదర్శనం, కార్యదర్శి సాయిస్వరూప్, సూపర్‌వైజర్ పర్వా శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ అంజయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ఏసీపీ పరిశీలన



లక్ష్మీనగర్‌లో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ బీ రాజేశ్వరరావు, ఎస్ఐ హరి శేఖర్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది శుక్రవారం గోదావరిఖని గాంధీ చౌరస్తా నుంచి రీగల్ షూ మార్ట్ చౌరస్తా, లక్ష్మీనగర్ ఏరియాలో పరిశీలించారు. వాహనాలు రోడ్డు మీద పెట్టకూడదని షాపుల యజమానులకు సూచించారు. ఏసీపీ శ్రీనివాస్ దుకాణాల దగ్గర రోడ్డుపై వాహనాలను నిలపరాదని, రోడ్డుపై వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని, దుకాణ యజమానులు తప్పనిసరిగా నో పార్కింగ్ బోర్డ్ పెట్టుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



పొత్కపల్లి హైస్కూల్ లో మాట్లాడుతున్న జడ్జి గణేష్

ఓదెల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఓదెల సివిల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి గణేష్ తెలిపారు. పొత్కపల్లి హైస్కూల్‌లో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. సమావేశంలో జడ్జి గణేష్ మాట్లాడుతూ అత్యాచారాలు, వేధింపులకు పాల్పడితే పోక్సో కేసు నమోదు అవుతుందని, శిక్షలు అనుభవిస్తారని తెలిపారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తుతోపాటు ఉన్నతమైన విద్య, మానవత విలువలను కోల్పోతారని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దని, యజమానులు శిక్ష అర్హులవుతారని తెలిపారు. అర్హత ఉన్న వ్యక్తులు వాహనాల ఇన్సూరెన్స్, లైసెన్సులు కలిగి ఉండాలని తెలిపారు. ప్రతీ విద్యార్థి ఓటు హక్కు కలిగి ఉండాలని, లేకుంటే నమోదు చేయించుకోవాలని కోరారు. ఎస్ఐ రమేష్ న్యాయవాదులు సర్వోత్తమ్ రెడ్డి, సత్యనారాయణ, అంబాల నరసయ్య, దొడ్డేపల్లి సారయ్య, యుగేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

సుల్తానాబాద్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లో శుక్రవారం రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నవంబర్ 15, 16 తేదీల్లో జిల్లా కేంద్రంలో మహాసభలను నిర్వహిస్తున్నామని, విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు సహకారం అందించాలన్నారు. మొదటి రోజు ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. బ్రహ్మాచారి, బండారి స్వామి, భూసారపు ఓదెలు, కొల్లూరి రవి, రవీందర్, కల్లెపల్లి ప్రసాద్, రాజు, వలస రాజమౌళి, రాములు, అజీజ్, శంకరయ్య, సంతోష్, భరత్, లింగమూర్తి, నయీమ్, సుధాకర్ రావు, లింగన్న, సంజీవ్, శ్రీను, ఓదెలు, రాజు, రమేష్, బాలు, కనకయ్య, శ్రీధర్, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): మార్కండేయకాలనీలోని కృష్ణవేణి స్కూల్‌లో శుక్రవారం జరిగిన స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ఆకట్టుకుంది. కృష్ణవేణి విద్యాసంస్థల చైర్‌పర్సన్, కరస్పాండెంట్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రసంగించారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలను వారి తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం గొప్ప అవకాశమని, తద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ ఆర్ట్స్, భాషా ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా నేషనల్ గ్రీన్ కార్ప్స్ సమన్వయకర్త జి.అంజన్‌కుమార్ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎకో బజార్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. క్యారీ బ్యాగ్స్ ప్లేట్స్ ప్లాస్టిక్ గ్లాసులు వంటివి వాడవద్దని సూచించారు.

కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ ఇ.మనోహర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. అధ్యాపకులు డాక్టర్ రవి, డాక్టర్ సుధా, డాక్టర్ అంబిక, డాక్టర్ రఘుపతి, అనిల్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. శుక్రవారం అప్పన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో చేపడుతున్న ప్రతీ పనిని రికార్డు చేయాలని డీపీవో సూచించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం, పరి శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మురికికాలువలు శుభ్రంగా ఉంచాలని, రోడ్డుకు ఇరువైపులా చెత్తచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

కాంటిజెంట్ వర్కర్ల జీతాలు చెల్లించాలి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కాంటింజెంట్ వర్కర్ల జీతాలు చెల్లించాలని ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు జాలిగం సమ్మయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పార్ట్ టైం వర్కర్ల జీతాలు 7 నెలలుగా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పా రు. రాష్ట్రంలో సుమారు 500 మంది కాంటిజెంట్ వర్కర్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని, జీతాలు పెంచి ఆదుకోవాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు



పతకాలతో విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సుల్తానాబాద్‌కు చెందిన ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన అండర్ 14 బాలుర విభాగంలో సంప్రీత్ 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు, హర్షవర్దన్ 600 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించాడు. పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, శివ, సతీష్, మమత పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి అప్రజాస్వామికం

సుల్తానాబాద్/ఓదెల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో న్యాయమూర్తిపై దాడి అప్రజాస్వామికమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, వారికి రక్షణ లేకుండా పోతోందన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి ప్రమాద సూచకంగా ఉందని మాదిగ మిత్రమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటగిరి పాపయ్య అన్నారు. మం డల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ దాడి చేసిన న్యాయవాదిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ తాళ్లపల్లి సదయ్య, సిపిఐ మండల కార్యదర్శి కోడెం స్వామి, తాళ్లపల్లి స్వామి, తాళ్లపల్లి రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్, దుర్గయ్య పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం సభ్యత్వ నమోదు

కమాన్‌పూర్/రామగిరి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాపూజీనగర్, సాయిగార్డెన్‌లో శుక్రవారం మున్నూరుకాపు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని టిక్కం కుమార్‌కు సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమిరిశెట్టి రామస్వామి, జిల్లా నాయకులు జడల సురేందర్ అందజేశారు. మండలాలు, గ్రామాల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కటకం రవీందర్, కటకం నారాయణ, గుమ్మడి శ్రీనివాస్, బోనాల సత్యనారాయణ, దండే కనకరత్నం, ఆకుల సత్యం, వెంకన్న, తిరుపతి పాల్గొన్నారు.

మహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలు

మంథని/సుల్తానాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథని మహాగణపతి ఆలయం, సుల్తానాబాద్‌లో సంకటహర చతుర్థి పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పల్లి రాముశర్మ, సాంబశివ దేవాలయంలో పూజారి పారువెల్ల రమేష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. పాత బజారులోని శివాలయంలో పూజారి వల్లకొండ మహేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ భాగ్యలక్ష్మి దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు. హోమం అనంతరం చంద్ర దర్శనం, నక్షత్ర దర్శనం చేసుకుని భక్తులు వ్రత ఉపవాస దీక్షలను పూర్తి చేశారు.

ఖని నుంచి మేడారానికి బస్సు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాల ప్యాకేజీలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ ప్రారంభించారు. రామప్ప, లక్నవరం, బోగాత జలపాతం ప్రాంతాలను సందర్శించి తిరిగి రాత్రి 10గంటలకు గోదావరిఖనికి చేరుకుంటుందని తెలిపారు. 30మంది మహిళలు ఈ యాత్రకు వెళ్లారు.

నిధులు మంజూరుపై హర్షం

మంథని, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అంబేద్కర్ చౌక్‌లో సంఘం ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా ఆర్‌పీఏ మెంబర్ మంథని సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, సంఘం నేతలు రాయమల్లు, వేణుగోపాల్, రాంచందర్, రఘు, భాను పాల్గొన్నారు.

చెట్లను తొలగించడానికి దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి బస్సు డిపో ప్రదేశంలో ఉన్న చెట్లను తొలగించడానికి దరఖాస్తులను ఆహ్వానించినట్టు గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. చెట్లను తొలగించడానికి కాంట్రాక్టర్లు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8టేకు, 45 వేప, రెండు కానుగ, 7సుబాబ్, రెండు సపోట, మూడు అల్లనేరేడి, మూడు కొబ్బరి, రెండు జామచెట్లు, 70అశోక చెట్లు, చింత, నిమ్మ, రెండు తుమ్మ చెట్లను తొలగించాల్సి ఉంటుందన్నారు. 9959225922, 9063401873 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఐసీడీఎస్ ఆఫీసు ఎదుట ఆందోళన

మంథని, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గత నెలలో అంగన్‌వాడి టీచర్లకు ఒక రోజు వేతనాన్ని అధికారులు కోత విధించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆఫీసు ఎదుట ఆందోళన చేశారు. డ్యూటీ చేసినప్పటికీ కోత విధించడం అన్యాయమని ఆరోపించారు. జ్యోతి, వనజా, శ్యామల, శోభ, సుగుణ, చంటమ్మ, గణేష్, సందీప్, రవిలు పాల్గొన్నారు.